సాక్షి
ఖమ్మం
మంగళవారం । 15 । జులై । 2025



రూ.లక్ష కోట్ల వడ్డీలేని రుణాలు

రాష్ట్రంలో మహిళలకు రూ.లక్ష కోట్ల మేర వడ్డీ లేని రుణాలు అందించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. 8లో



బస్సును ఢీకొట్టిన ట్యాంకర్

బస్సును వెనుక నుంచి ట్యాంకర్ ఢీకొట్టగా వెనుక భాగంలో సీట్ల మధ్య ఇద్దరు ఇరుక్కుపోగా డ్రైవర్ సహా పలువురికి గాయాలయ్యాయి. 8లో

గరిష్టం / కనిష్టం
35° / 26°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముంది. మధ్యాహ్నం అంతటా ఉక్కపోత వాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

పాఠశాలల్లో పెరిగిన విద్యార్థుల నమోదు



స్థానికులతో మాట్లాడుతున్న డీఈఓ సత్యనారాయణ

ఏన్కూరు: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది విద్యార్థులు నమోదు పెరిగిందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.సత్యనారాయణ తెలిపారు. ఏన్కూరు మండలం కొత్తమేడేపల్లి పాఠశాలను సోమవారం తనిఖీ చేసిన ఆయన విద్యార్థుల నమోదు, హాజరు, బోధనపై ఆరా తీశారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ పాఠశాలలో వసతులు కల్పించడంతో పాటు బడిబాట ద్వారా విద్యార్థుల నమోదు పెరిగిందన్నారు. కలెక్టర్ చొరవతో కొత్తమేడేపల్లి పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై నియమించనున్నామని తెలిపారు. కాగా, జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఒక జత యూనిఫామ్ పంపిణీ చేశామని డీఈఓ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏంఈఓ రహీంబీ, ఉపాధ్యాయుడు జయరాం పాల్గొన్నారు.

ఉద్యోగ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

ఖమ్మంమయూరిసెంటర్: గ్రూప్–1, 2, 3, 4తో పాటు ఆర్‌ఆర్‌బీ, ఎస్‌ఎస్‌సీ, బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ల పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి.శ్రీలత తెలిపారు. ఈ శిక్షణ వచ్చే నెల 25నుంచి 150 రోజులు ఉంటుందని పేర్కొన్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈనెల 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని, వివరాలకు 08742–230848, 95738 59598, 94419 31359 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు ఆన్‌లైన్‌లో శిక్షణ

ఖమ్మం సహకారనగర్: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన అంశాలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారులు మంగళవారం ఆన్‌లైన్ విధానంలో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణలో జెడ్పీ అధికారులు, డీపీఓ, ఎంపీడీఓలు పాల్గొనాలని ఆదేశాలు అందాయి. జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో ఉదయం 11–30నుంచి 12–30గంటలకు వరకు శిక్షణ జరగనుండగా, ఆతర్వాత కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సమీక్షించనున్నారు.

'సీతారామ'తో 60 వేల ఎకరాలకు సాగునీరు



గోదావరి జలాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ఏన్కూరు: సీతారామ ప్రాజెక్టు ద్వారా వైరా నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 60 వేల ఎకరాలకు గోదావరి జలాలు అందనున్నాయని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ తెలిపారు. అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులోని సీతారామ ప్రాజెక్టు పంప్‌హౌస్ నుంచి విడుదల చేసిన నీరు జూలూరుపాడు మండలం వినోభానగర్ నగర్ వద్దకు చేరాయి. ఈ మేరకు ఏన్కూరులోని సాగర్ లింక్ కెనాల్‌కు నీటిని సోమవారం విడుదల చేసిన ఎమ్మెల్యే రాందాస్ మాట్లాడారు. వర్షాభావ పరిస్థితుల్లో సాగుకు ఇబ్బంది లేకుండా గోదావరి జలాలు ఉపయోగపడతాయని తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు శెట్టిపల్లి వెంకటేశ్వరావు, వేముల కృష్ణప్రసాద్, స్వర్ణ నరేందర్, రాయల నాగేశ్వరావు, బొర్రా రాజశేఖర్, మేడ ధర్మారావు పాల్గొన్నారు.

సాగర్ ఆయకట్టుకు సాగుకళ



కృష్ణా జలాలకు చీర, సారె సమర్పిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి

పాలేరు రిజర్వాయర్ నుంచి వెయ్యి క్యూసెక్కుల నీటి విడుదల

- దశల వారీగా పూర్తిస్థాయిలో విడుదలకు ప్రణాళిక
- ఆయకట్టు పరిధిలో 2.54 లక్షల ఎకరాల సాగుకు భరోసా
- ఎడమకాల్వ వద్ద స్విచాన్ చేసిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: కృష్ణా జలాలు సాగర్ కాల్వల్లో బిరబిరా పరుగులెడుతున్నాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగుపై సందిగ్ధత నెలకొన్న వేళ సాగర్ జలాలు రావడంతో సాగుకు రైతులు సిద్ధం అవుతున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌లోకి నీరు చేరడంతో సాగు అవసరాలకు పాలేరు రిజర్వాయర్ నుంచి సోమవారం వెయ్యి క్యూసెక్కుల నీరు వదిలారు. రానున్న రోజుల్లో పూర్తి స్థాయిలో నీటి విడుదలకు కార్యాచరణ రూపొందించారు. ఏటా జులై చివరి వారం, ఆగస్టు మొదటి వారంలో విడుదల చేసే సాగర్ జలాలను ఈసారి ఇక్కడ వర్షాభావ పరిస్థితుల నేపథ్యాన ముందస్తుగానే వదలడంతో 2.54 లక్షల ఎకరాల ఆయకట్టులో పంటల సాగుకు కష్టాలు తీరనున్నాయి.

నిన్నటి వరకు వెలవెల

జిల్లాలో ప్రధాన సాగునీటి వనరుగా నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిలుస్తుండగా, పాలేరు రిజర్వాయర్ నీరు లేక వెలవెలబోయింది. రిజర్వాయర్ నీటినిల్వ సామర్థ్యం 23 అడుగులు కాగా.. ఈనెల మొదట్లో 12.45 అడుగులకు పడిపోయింది. దీంతో అటు సాగు, ఇటు తాగునీటికి ఇబ్బందులు తలెత్తాయి. జిల్లాలో సాగర్ ఆయకట్టు పరిధిలోని 2.54 లక్షల ఎకరాల సాగుపై సందిగ్ధత నెలకొంది.

తాగునీటి అవసరాలకు..

పాలేరు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తగ్గడంతో తాగునీటికి ఇబ్బంది ఎదురవుతుందని భావిస్తుండగానే కృష్ణా పరీవాహకంలో భారీ వర్షాలతో శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీరు చేరింది. ఈక్రమాన సాగర్ నుంచి పాలేరు రిజర్వాయర్‌లోకి నీరు విడుదల చేయడంతో రిజర్వాయర్ 20 అడుగులకు చేరింది. ఈ నీటిని తాగునీటి అవసరాలకే వినియోగించాలని భావించినా, రైతుల అవస్థల దృష్ట్యా సాగు కోసం కూడా విడుదల చేయాలని నిర్ణయించారు. ఇక ఏటా మాదిరిగా సాగు అవసరాలకు ఈనెల 20నుంచి సాగర్ జలాలు విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. దీంతో పాలేరు రిజర్వాయర్‌లో 20 అడుగులుగా ఉన్న నీటిని దిగువకు విడుదల చేస్తున్నా.. మరోమారు సాగర్ నుంచి వచ్చే నీటితో రిజర్వాయర్ నిండుతుందని భావిస్తున్నారు.

పంటల సాగుకు సిద్ధం..

సాగుపై సందిగ్ధంగా ఉన్న సమయాన సాగర్ జలాలు విడుదల కావడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకు దుక్కులు దున్ని, వరి నారు సిద్ధం చేసుకున్న రైతులు ఇప్పుడు ధైర్యంగా నాట్లు వేయనున్నారు. జిల్లాలో సాగర్ ఆయకట్టు కింద 2,54,270 ఎకరాల భూమి ఉండగా, ఈ నీటితోనే పాలేరు, వైరా రిజర్వాయర్లు, పలు చెరువులు నింపాల్సి ఉంటుంది.

స్విచాన్ చేసి రెండో జోన్‌కు..

పాలేరు రిజర్వాయర్ వద్ద రెండో జోన్‌కు సాగు నీటిని సోమవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విడుదల చేశారు. తొలుత వెయ్యి క్యూసెక్కుల నీరు దిగువకు వదలగా.. డిప్యూటీ సీఎం, మంత్రి పూజలు చేసి కృష్ణా జలాలకు చీర, సారె సమర్పించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్‌దత్, ఆర్డీఓ నర్సింహారావు, ఇరిగేషన్ ఎస్‌ఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రవికుమార్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వరినాట్లు వేసుకుంటాం..



మాకు పెద్ద కాల్వ కింద మూడెకరాల భూమి ఉంది. ఇన్నాళ్లు నీళ్ల పరిస్థితి తెలియక నాట్లు వేయడానికి ఆలోచించా. కానీ ముందుగానే సాగర్ నీళ్లు వదలడంతో వరి నాట్లు వేస్తాం. ముందుగా నీళ్లు వదలడం రైతులకు ఎంతో మంచిది.
– జవ్వాజి పవన్‌కుమార్, మల్లాయిగూడెం

సాఫీగా నీటి ప్రవాహం



యూటీ వద్ద కాల్వలో నీటి ప్రవాహం

కూసుమంచి: సాగర్ ఎడమ కాల్వపై మత్స్య పరిశోధన కేంద్రం వద్ద ఉన్న యూటీ గత ఏడాది వరదలతో కొట్టుకుపోగా పునర్నిర్మించారు. ఈ పనులు చివరి దశకు చేరగా నిర్మాణ ప్రాంతం వద్ద కాల్వలో నీరు సాఫీగా సాగేలా అధికారులు ఇరువైపులా మట్టి కట్టలు వేయించారు. కాల్వకు డిప్యూటీ సీఎం, మంత్రి నీరు విడుదల చేశాక యూటీ వద్ద సాఫీగా ప్రవహించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

వెదురు బొంగులకు చెదలు..

- భారీగా సరుకు రాక.. వేలంలో జాప్యంతో సమస్య
- సత్తుపల్లి డిపోలో పరిశీలించిన ఎఫ్‌డీసీ ఎండీ సునీత ఎం.భగవత్



డిపోలో చెదలు పడుతున్న వెదురుబొంగులు

సత్తుపల్లి: నాణ్యత లేకపోవడమేకాక ఒకేసారి భారీగా సరుకు వచ్చినా వేలంలో జాప్యంతో వెదురు బొంగులు చెదలు పడుతున్నాయి. అంతేకాక తాజా వర్షాలతో తడిసి ఎక్కడికక్కడ విరిగిపోతుండడంతో ప్రస్తుతం వేలం వేసినా సరైన ఆదాయం వచ్చే పరిస్థితులు కానరావడం లేదు. వెదురు బొంగుల్లో నాణ్యత లేమికి తోడు అధికారుల నిర్లక్ష్యంతో ఈ సమస్య ఎదురైనట్లు తెలుస్తోంది.

4లక్షలకు పైగా బొంగులకు...

సత్తుపల్లిలో అటవీ అభివృద్ధి కార్పొరేషన్(ఎఫ్‌డీసీ) ద్వారా ఏళ్ల క్రితం వెదురు డిపో ఏర్పాటుచేశారు. ఈ డిపోకు సత్తుపల్లి, కొత్తగూడెం, పాల్వంచ అటవీ డివిజన్ల నుంచి వెదురుబొంగు వస్తోంది. ఏటా 12 – 15లక్షల టన్నుల వెదురు డిపోకు వస్తుందని అంచనా. కానీ ఈ ఏడాది వెదురుబొంగుల చెట్లకు ఫ్లవరింగ్(పూత) సమస్య రావడంతో ఒకేసారి చెట్లన్నీ తొలగించారు. దీంతో ఏకంగా డిపోకు 33లక్షల వెదురుబొంగులు చేరాయి. సత్తుపల్లి మండలం బుగ్గపాడు, దమ్మపేట మండలం గండుగులపల్లి రేంజ్‌ల్లో 40 ఏళ్ల క్రితం అటవీ అధికారులు వెదురు ప్లాంటేషన్ వేశారు. అప్పటి నుంచి దిగుబడి బాగానే వచ్చింది. ఈ ఏడాది చెట్ల జీవితకాలం ముగియనుండడంతో ఫ్లవరింగ్ వచ్చినట్లు తెలుస్తుండగా విక్రయాల్లో జాప్యంతో చెదలు పడుతున్నట్లు తెలిసింది. ఇందులో 4లక్షలకు పైగా బొంగులకు చెదలు పట్టడంతో ఎక్కడికక్కడ విరిగిపోతున్నాయని సమాచారం.

వేలంలో అధికారుల నిర్లక్ష్యం

వెదురు పెద్ద ఎత్తున రావటంతో అధికారులు సరైన రీతిలో స్పందించలేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రతీ నెల రెండుసార్లు వేలంపాట ద్వారా వెదురు అమ్ముతుంటారు. కానీ ఎక్కువ మొత్తంలో పేరుకుపోతే కనీసం ఐదారు సార్లు వేలం వేసే అవకాశం ఉన్నా ఆ దిశగా స్పందించలేదు. ఫలితంగా వెదురు పేరుకుపోయి చెదలు పట్టి ఇప్పుడు అమ్మలేని పరిస్థితి ఎదురైంది. కాగా, వెదురుబొంగుతో చేసిన గుజ్జుతో చెక్ పేపర్లు, బాండ్ పేపర్లు తయారుచేస్తారు. ఇటీవల వెదురుబొంగుల స్థానంలో సుబాబుల్, జామాయిల్ వినియోగిస్తుండడంతో డిమాండ్ తగ్గుతోంది. గతంలో భద్రాచలం, కాగజ్ నగర్, రాజమండ్రి పేపర్ బోర్డుల నుంచి వచ్చే ఆర్డర్లు తగ్గాయని సమాచారం.

ఉత్పత్తి పెరగడంతోనే...



ఉద్యోగులకు సూచనలు చేస్తున్న ఎఫ్‌డీసీ ఎండీ సునీత

ఈ ఏడాది వెదురుబొంగుల ఉత్పత్తి పెరగగా, ఆర్డర్లు సరిపడా లేక బొంగులు పేరుకుపోయి చెదలు పడుతోందని టీజీ ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ సునీత ఎం.భగవత్ తెలిపారు. సత్తుపల్లి అటవీ అభివృద్ధి కార్పొరేషన్ డిపోను సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ నష్ట నివారణ చర్యల్లో భాగంగా వెదురు బొంగును కటింగ్ చేసి పరిశ్రమలకు విక్రయిస్తామని తెలిపారు. అయితే, వెదురుకు చెదలు పట్టడం వల్ల నష్టం ఎదురవుతుందనే ప్రచారంలో వాస్తవం లేదని చెప్పారు. కాగా, ఈ ఏడాది ఎకో టూరిజం, జామాయిల్, జీడిమామిడి సాగుతో సంస్థకు రూ.310 కోట్ల ఆదాయం లభించిందని తెలిపారు. జిల్లాలోని కనిగిరిగుట్టల్లో ఎకో టూరిజం అభివృద్ధికి అవకాశాలను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. ఎఫ్‌డీసీ ఉద్యోగులు సైకలాబ్, ఎం.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవానికి పక్కా ప్రణాళిక

- సమన్వయంతో భూసమస్యల పరిష్కారం
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ఖమ్మం సహకారనగర్: జిల్లాలో వన మహోత్సవం విజయవంతం చేసేలా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి సోమవారం ఆయన రెవెన్యూ, అటవీ భూముల సమస్యలు, వన మహోత్సవం, ప్రభుత్వ గురుకులాల్లో మెనూ అమలుపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. వన మహోత్సవంలో భాగంగా మండలాల వారీగా పదెకరాలకు తక్కువ కాకుండా బ్లాక్‌లు గుర్తించి మొక్కలు నాటాలన్నారు. అలాగే, ప్రభుత్వ గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ సమస్య రాకుండా మెనూ అమలు, సామగ్రి నాణ్యతపై ఆర్సీఓలు పర్యవేక్షించాలని తెలిపారు. తహసీల్దార్లు ప్రభుత్వ గురుకులాలను వారానికోసారి తనిఖీ చేయాలని, గురుకులాల్లో కమిటీల నిర్వహణపై సూచనలు చేయాలన్నారు. అలాగే, ప్రభుత్వ భూముల పరిరక్షణకు అటవీ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

దళారులకు ఆస్కారమివ్వొద్దు...

రెవెన్యూ వ్యవస్థలో దళారులకు ఆస్కారం ఇవ్వకుండా నిబంధనల ప్రకారమే పనులు జరిగేలా అధికారులు, ఉద్యోగులు విధులు నిర్వర్తించాలని కలెక్టర్ అనుదీప్ ఆదేశించారు. రెవెన్యూ శాఖపై అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి సమీక్షించిన ఆయన తహసీల్, ఇతర కార్యాలయాల ఉద్యోగులు ప్రజల సమస్యల పరిష్కారంలో ఇతరుల జోక్యాన్ని అరికట్టాలని తెలిపారు. అలాగే, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల నుంచి దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని, మీ సేవా కేంద్రాలను తరచూ తనిఖీ చేయాలని సూచించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ, రహదారులు, మున్నేరు రిటైనింగ్ వాల్‌కు భూసేకరణపై కలెక్టర్ సూచనలు చేశారు. డీఆర్‌ఓ పద్మశ్రీ, ఎస్‌డీసీ రాజేశ్వరి, ఆర్డీఓలు నర్సింహారావు, రాజేందర్ గౌడ్, ఏపీడీ శిరీష పాల్గొన్నారు.

సింధుకు అండగా ఎంపీ, మంత్రి

కూసుమంచి: కూసుమంచి మండలంలోని ధర్మా తండాకు చెందిన జర్పుల సింధు రోడ్డు ప్రమాదంలో గాయపడి అచేతన స్థితికి చేరగా, వైద్యం చేయించలేని పరిస్థితుల్లో ఆమె తండ్రి పరశురాం ఇటీవల ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన గతనెల 29న ఆత్మహత్య చేసుకోగా 'సాక్షి' ప్రధాన సంచికలో 'నా వల్ల కావడం లేదు తల్లీ' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సుమోటాగా స్వీకరించిన విషయం విదితమే. అలాగే, ఈనెల 3వ తేదీన సింధు కుటుంబాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పరామర్శించి సింధు చికిత్స బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగానే ఆమెను ఎంపీ రఘురాంరెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రిలో చేర్పించారు. అలాగే, సింధు చికిత్సపై వైద్యులతో మాట్లాడడమే కాక మందులు ఇప్పించి ఆర్థిక సాయం అందజేశారు.



సింధును ఆస్పత్రిలో చేర్పిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

డిజిటల్ లావాదేవీలకు జిల్లా ఎంపిక

- జిల్లా సమాఖ్య సమావేశంలో సెర్ప్ సీఈఓ దివ్య
- మహిళా మార్ట్ నిర్వహణ బాగుందని కితాబు

ఖమ్మంమయూరిసెంటర్: మహిళా సంఘాలకు ఇచ్చే బ్యాంక్ లింకేజీ రుణాలు సకాలంలో తిరిగి చెల్లించేలా అధికారులు, సిబ్బంది పర్యవేక్షించాలని సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ సూచించారు. జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం ఆమె ఖమ్మంలోని మహిళా మార్ట్‌ను సందర్శించాక జిల్లా సమాఖ్య భవనంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, డీఆర్‌డీఏ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ దేశంలోని 700 జిల్లాల్లో పది జిల్లాలను డిజిటల్ లావాదేవీలకు ఎంపిక చేయగా జాబితాలో ఖమ్మం కూడా ఉన్నందున మహిళా సంఘాల సభ్యులు నగదు లావాదేవీలను డిజిటల్ విధానంలో చేసేలా ప్రోత్సహించాలని తెలిపారు. అలాగే, సంఘాల నిర్వహణలో అవకతవకలు జరగకుండా, రుణాల మంజూరు, రికవరీ సాఫీగా జరిగేలా మహిళా సంఘాల సభ్యులతో సమావేశాలు నిర్వహిస్తూ ఏపీఎం, డీపీఎంలు పాల్గొనాలని సూచించారు. జిల్లాలో మహిళా సమాఖ్యలకు గోదాంలు మంజూరు చేశామని, మండల సమాఖ్యలకు రెండు, వీఓఏలకు కేటాయించిన ఎనిమిది గోదాంల నిర్మాణాన్ని పర్యవేక్షించాలని తెలిపారు. కాగా, ప్రతీ గ్రామ సమాఖ్య పరిధిలో 15 – 18 ఏళ్ల కిశోర బాలికలు, 60 ఏళ్లు పైబడిన మహిళలు, దివ్యాంగులతో ఒక్కో సంఘం ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. కాగా, బస్సు నడిపేందుకు ఆసక్తి ఉన్న మహిళలను గుర్తిస్తే శిక్షణ ఇప్పించనున్నట్లు సీఈఓ వెల్లడించారు.



మహిళా మార్ట్‌లో అదనపు కలెక్టర్ శ్రీజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్‌తో మాట్లాడుతున్న సెర్ప్ సీఈఓ దివ్య

మహిళా మార్ట్ అద్భుతం..

మహిళా సంఘాల సభ్యులు రూపొందించే ఉత్పత్తుల అమ్మకానికి మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేయడం.. నిర్వహణను సెర్ప్ సీఈఓ దివ్య అభినందించారు. మహిళా మార్ట్‌లో ఉత్పత్తులను పరిశీలించిన ఆమె సభ్యులతో మాట్లాడి ప్యాకింగ్, అమ్మకాలపై ఆరా తీశారు. ఆతర్వాత మార్ట్ వద్ద క్యాంటీన్‌లో టీ తాగి సిబ్బందిని అభినందించారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, సెర్ప్ డైరెక్టర్లు రజిత, నర్సింహారెడ్డి, అడ్మిన్ విజయలక్ష్మి, డీఆర్‌డీఓ ఆర్.సన్యాసయ్య, అడిషనల్ డీఆర్‌డీఓ జయశ్రీ, డీపీఎంలు ఆంజనేయులు, రాజేష్ పాల్గొన్నారు.

ఫిర్యాదులు పరిష్కరించండి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



క్యూలో నిల్చున్న ఫిర్యాదుదారులు

అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం సహకారనగర్: ప్రజలు ఇచ్చే ఫిర్యాదును పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణిలో భాగంగా ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశమై పరిష్కారంపై సూచనలు చేశారు.

క్యూ కడుతున్నారు...

ప్రతీ వారం కలెక్టర్‌లో నిర్వహించే ప్రజావాణికి జనం తాకిడి పెరుగుతోంది. అయితే, ఎవరికి వారే ముందు ఫిర్యాదు ఇవ్వాలనే భావనతో గుంపులుగా చేరి అధికార యంత్రాంగాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. సోమవారం కూడా ఇదే పరిస్థితి ఎదురు కాగా పోలీస్ సిబ్బంది చేరుకుని అంతా క్యూలో వచ్చేలా నియంత్రించారు.

మిర్చి ధర ముందడుగు..

- రూ.350 నుంచి రూ.500 పెరుగుదల
- వివిధ రాష్ట్రాల్లో డిమాండ్‌తో ఫలితం

ఖమ్మంవ్యవసాయం: మిర్చి ధరలో స్వల్ప పెరుగుదల నమోదైంది. కొంతకాలంగా ధరలతో పోలిస్తే ప్రస్తుతం రూ.350 నుంచి రూ.500మేర పెరిగింది. మార్చి, ఏప్రిల్‌లో క్వింటా మిర్చికి రూ.13,500 నుంచి రూ.13,850మధ్యే పలకగా మే నెలలో రూ.13వేలు కూడా దాటలేదు. జూన్ ఆరంభంలో ఏసీ మిర్చికి రూ.14,200వరకు రాగా, ఆతర్వాత రూ.13వేలకు పడిపోయినా ఈ నెలారంభం నుంచి పురోగతి కనిపించింది. ఏసీ మిర్చి తేజా రకం ధర రూ.13,350 నుంచి పెరుగుతూ 11వ తేదీన రూ.13,500కు చేరింది. సోమవారం మరో రూ.350 పెరిగి రూ.13,850గా నమోదైంది. నాన్ ఏసీ మిర్చి జూన్‌లో రూ.12,500లోపే పలకగా, సోమవారం రూ.13,600కు చేరింది.

ఇతర రాష్ట్రాల్లో వినియోగంతో...

మిర్చి ధర దేశీయ మార్కెట్‌లోనే పెరుగుతుండడంతో ఇక్కడ కూడా ఫలితం కనిపిస్తోంది. యూపీ, బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో తేజా రకం మిర్చి వినియోగం పెరగడం ఇందుకు కారణమని వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. తేజా రకం మిర్చిని చైనా దేశానికి ఎగుమతి చేస్తున్నా ఈసారి ఆర్డర్లు రాలేదు. కానీ దేశీయంగా ఆర్డర్లతో ధరలో కదలిక రావడం రైతుల్లో ఆశలు నింపుతోంది. జిల్లాలోని 48 కోల్డ్ స్టోరేజీల్లో దాదాపు 48 లక్షల మిర్చి బస్తాలు, రైతుల ఇళ్లలో కూడా మిర్చి నిల్వ ఉండగా క్వింటాకు ధర రూ.15 వేల మార్క్ తాకితే అమ్మకాలు ఊపందుకునే అవకాశముందని భావిస్తున్నారు.



ఖమ్మం మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన మిర్చి

క్లుప్తంగా

కిసాన్ కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

ఖమ్మంమయూరిసెంటర్: కిసాన్ కాంగ్రెస్‌ను గ్రామీణ ప్రాంతం నుండి బలోపేతం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ దుర్గప్రసాద్ సూచించారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం జరిగిన కిసాన్ కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం అమలుచేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో వివరించాలని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు జలాలతో జిల్లా సస్యశ్యామలం కానుందని చెప్పారు. త్వరలో కిసాన్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుల శిక్షణ ఏర్పాటుచేయనుండగా, ఆలోగా కమిటీల నియామకం పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మొక్క శేఖర్ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావుతో పాటు వివిధ మండలాల నాయకులు వల్లూరి భద్రారెడ్డి, భూక్యా చిన నాయక్, శీలం బ్రహ్మారెడ్డి, గాదె ప్రసాద్, కడియాల సుధాకర్, చింతనిప్పు మాధవరావు, గుత్తా గంగయ్య, మూడుముంతల గంగరాజు, ప్రతిభారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి అడిషనల్ డీఎంహెచ్‌ఓగా సైదులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.సైదులుకు ఉద్యోగోన్నతి లభించింది. ఆయనను భద్రాద్రికొత్తగూడెం జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌ఓగా నియమిస్తూ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ బి.రవీంద్రనాయక్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్‌సైదులు ఖమ్మం జిల్లాలో సుదీర్ఘ కాలం వివిధ విభాగాల ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించారు. ఆయన పదోన్నతి పొందిన సందర్భంగా అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

వైదిక సంఘం జిల్లా నూతన కమిటీ


సీతారామశాస్త్రి


ఆదిత్య సరస్వతీకుమార్


ప్రసాద్‌శర్మ

ఖమ్మంగాంధీచౌక్: వైదిక సంఘం జిల్లా నూతన కమిటీని ఖమ్మంలో ఎన్నుకున్నారు. మూడేళ్ల కాలానికి ఎన్నుకున్న ఈ కమిటీలో అధ్యక్షుడిగా తాటికొండల సీతారామశాస్త్రి, ప్రధాన కార్యదర్శిగా కాందూరి ఆదిత్య సరస్వతీకుమార్ ఎన్నికయ్యారు. అలాగే, కోశాధికారిగా కొనకంటి ప్రసాద్ శర్మలను ఎన్నుకున్నట్లు దేవలపల్లి ఆంజనేయశర్మ, కొనకంచి సాయిరాముశర్మ తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని బైక్ ఢీకొని..

యువకుడు మృతి, మరొకరి పరిస్థితి విషమం

ఇల్లెందురూరల్: విద్యుత్ స్తంభాన్ని బైక్ ఢీకొని ఓ యువకుడు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని ఇల్లెందులపాడు చెరువు కట్ట సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం ముత్యాలగూడెం గ్రామానికి చెందిన వీరబోయిన సాగర్ (23), శేరిపురం గ్రామానికి చెందిన వట్టం కొండల్‌రావు, రాజు బైక్‌పై ఇల్లెందు మండలంలోని ఏడుబావుల జలపాతం వద్దకు వెళ్లారు. సరదాగా గడిపి రాత్రి తిరిగి వస్తుండగా చెరువు కట్ట వద్ద మూలమలుపులో విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్నారు. దీంతో తీవ్ర గాయాలై సాగర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కొండల్‌రావుకు కూడా తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు. రాజు ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,300	800
పెసలు	6,610	4,500
కందులు	6,000	5,900
మినుములు	5,700	4,500
అలసంద	5,800	5,800
ఏసీ మిర్చి	13,850	8,000
ఏసీ మిర్చి తాలు	6,800	6,500
మిర్చి	13,600	6,000
మిర్చి తాలు	6,500	5,000
పత్తి	7,825	6,000


– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.17,463

రూ.లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు

- మహిళా సంఘాలతో సోలార్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటు
- కుటీర పరిశ్రమల ఏర్పాటుకు శిక్షణ ఇప్పిస్తాం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క


వడ్డీ లేని రుణాల చెక్కు అందిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, పక్కన సెర్ప్ సీఈఓ దివ్య, కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్యే రాందాస్, అధికారులు, (ఇన్‌సెట్) ఇంటి మంజూరు పత్రం ఇవ్వడంతో వృద్ధురాలి ఆనందం

చింతకాని: రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే సంకల్పంతో మహిళా సంఘాలకు రూ.లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు ఇవ్వనున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ప్రకటించారు. చింతకాని మండల కేంద్రంలో సోమవారం మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల చెక్కులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేసిన ఆయన ఇందిరా మహిళా శక్తి సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో వడ్డీ లేని రుణాలను ఇవ్వకపోగా, తాము అధికారంలోకి రా గానే పునర్ధరించడమే కాక మొదటి ఏడాదే రూ. 21,632 కోట్లు వడ్డీ లేని రుణాలు అందించామని తెలిపారు. అలాగే, సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్‌ల ఏర్పాటు, నిర్వహణ బాధ్యతలు సైతం మహిళా సంఘాలకు అప్పగించనున్నట్లు చెప్పారు. మధిర నియోజకవర్గంలోని నాలుగెకరాల్లో 2 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు ఒప్పందం కుదిరిందని తెలిపారు. కాగా, ప్రతీ నియోజకవర్గంలో మహిళలకు శిక్షణ ఇప్పించి కుటీర పరిశ్రమలు ఏర్పాటుచేయిస్తామని వెల్లడించారు. ఇప్పటికే మహిళా సంఘాల ద్వారా బస్సులు కొనుగోలు చేయించి ఆర్టీసీకి అద్దెకు ఇవ్వగా, పెట్రోల్ బంకులు, ఇసుక రీచ్‌ల నిర్వహణ కూడా వారికే అప్పగిస్తున్నామని తెలిపారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

నిరుపేదలందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేయగా, లబ్దిదారులకు దశల వారీగా బిల్లులు ఇస్తున్నామని చెప్పారు. అలాగే, రేషన్‌కార్డులపై సన్న బియ్యం, రూ.500కే సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి రూ.6,632 కోట్లు వెచ్చించామని తెలిపారు. సెర్ప్ సీఈఓ డి.దివ్య మాట్లాడుతూ మహిళా సంఘాలకు ఇచ్చిన రుణాల్లో 99 శాతం తిరిగి చెల్లిస్తున్నారని చెప్పారు. మహిళా సంఘాల సభ్యులకు చీరలు ఇవ్వడానికి కార్యాచరణ రూపొందించామని తెలిపారు. ఈకార్యక్రమంలో మధిర నియోజకవర్గంలోని 4,590 మహిళా సంఘాలకు రూ.5.93 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కు, చింతకాని మండలానికి చెందిన 539 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, నియోజకవర్గానికి చెందిన మహిళా సంఘాలకు రూ.36.21 లక్షల బీమా చెక్కు, బోనకల్ మండలానికి చెందిన కిరణ్‌కుమార్‌కు రూ.10 లక్షల ప్రమాద బీమా చెక్కు భట్టివిక్రమార్క ఈ సందర్భంగా అందజేశారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమీషనర్ సునీల్‌దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, డీఆర్‌డీఓ సన్యాసయ్య, డీఎస్‌ఓ చందన్‌కుమార్, డీపీఓ ఆశాలత, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, డీఎంహెచ్‌ఓ కళావతి బాయి, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

కొరవడుతున్న పర్యవేక్షణ

- ఉమ్మడి జిల్లాలో 600 పైగా ఆలయాలు
- ఏడాదికి రూ. 2లక్షలకు పైగా ఆదాయం వచ్చేవి 92..
- ఈ దేవస్థానాల్లో 18 ఈఓ పోస్టులు.. ఉన్నది 11 మందే
- ఇన్‌చార్జ్‌లతో భక్తులకు తప్పని ఇక్కట్లు

పాల్వంచరూరల్: దేవాలయాల్లో భక్తుల సౌకర్యాలు, ఆలయ ఆస్తుల పరిరక్షణ, సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణ చేయాల్సిన ఈఓ పోస్టులు ఖాళీగా ఉండడంతో ఇక్కట్లు తప్పడం లేదు. ఉమ్మడి జిల్లాలోని అనేక ఆలయాల్లో ఈ సమస్య వేధిస్తోంది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 600 ఆలయాలు ఉండగా, ఇందులో ఏడాదికి రూ.2లక్షలు, ఆపైన ఆదాయం వచ్చే ఆలయాలు 92 ఉన్నాయి. ఈ ఆలయాలకు సంబంధించి 18 ఈఓ పోస్టులు కేటాయించారు. అంటే ఒక్కో ఈఓ సుమారు ఐదు ఆలయాలను పర్యవేక్షించాలి. అయితే, ఈ 18లోనూ ప్రస్తుతం 11 మందే విధులు నిర్వరిస్తుండడంతో వీరిపై అదనపు భారం పడడమే కాక భక్తులకు కనీస సౌకర్యాలు అందడం లేదు.

పెద్ద ఆలయాలకూ దిక్కు లేదు..

ఉమ్మడి జిల్లాలో నిత్యం భక్తుల రద్దీ ఉండే పలు ఆలయాలకు కూడా రెగ్యులర్ ఈఓలు లేరు. భద్రాద్రి జిల్లాలోని అన్నపురెడ్డిపల్లి శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయం, కొత్తగూడెంలోని విజయ విఘ్నేశ్వరస్వామి, పాల్వంచలోని పెద్దమ్మతల్లి, భద్రాచలంలోని అభయాంజనేయస్వామి ఆలయాల్లో ఇన్‌చార్జ్ ఈఓలే విధులు నిర్వర్తిస్తున్నారు. ఖమ్మం జిల్లాలో జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి, ఖమ్మం కమాన్ బజార్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం, ఖమ్మం రూరల్ మండలంలోని మారెమ్మగుడి వంటి పెద్ద ఆలయాలకు కూడా రెగ్యులర్ ఈఓలు లేరు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 11 మంది ఈఓలు ఉండగా, వారికి కేటాయించిన ఆలయాలతో పాటు ఆదాయం తక్కువగా ఉన్న ఇతర దేవాలయాల పర్యవేక్షణ బాధ్యతలు కూడా వీరిపైనే పడుతున్నాయి.

ఒక్క అధికారి.. 17 ఆలయాలు

ఈఓలు పరిమితికి మించి ఆలయాలకు ఇన్‌చార్జ్ లుగా ఉండడంతో పర్యవేక్షణ కొరవడుతోంది. కొత్తగూడెంలోని దాసాంజనేయస్వామి ఆలయ ఈఓ శేషయ్య 17 దేవస్థానాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇందులో భద్రాద్రి జిల్లాలో ఏడు, ఖమ్మం జిల్లాలో పది ఉన్నాయి. పెద్దమ్మగుడి ఆలయ ఈఓ రజినీకుమారి ఇక్కడే ఇన్‌చార్జ్‌గా ఉండగా, ఈ దేవస్థానంతో పాటు పాల్వంచలోని భజన మందిరం, పాత పాల్వంచలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, కొత్తగూడెంలోని విఘ్నేశ్వరస్వామి ఆలయం, ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలంలోని నీలాద్రీశ్వరస్వామి ఆలయాల బాధ్యతలూ చూస్తున్నారు. ఖమ్మంలోని ప్రసిద్ధ శ్రీ స్తంభాద్రి లక్ష్మీ నృసింహస్వామి ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు జమలాపురం, జీళ్లచెరువులోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాలతో పాటు మారెమ్మగుడికి కూడా ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. దీంతో వీరు ఎక్కడా పూర్తిస్థాయిలో పని చేయలేకపోతున్నారు. ఉమ్మడి జిల్లాకు కేటాయించిన 18 పోస్టుల్లో ఖాళీగా ఏడు భర్తీ చేయడంతో పాటు అధిక ఆదాయం ఉన్న ఆలయాలకు ప్రత్యేకంగా ఈఓలను నియమించాలని భక్తులు కోరుతున్నారు.

అన్యాక్రాంతమవుతున్న ఆలయ భూములు..

ఉమ్మడి జిల్లాలో దేవాదాయ శాఖ పరిధిలో మొత్తం 14,771 ఎకరాల భూములు ఉన్నాయని రికార్డులు చెబుతున్నాయి. ఇందులో ఖమ్మం జిల్లాలో 4,865 ఎకరాలు ఉండగా 862 ఎకరాలు అన్యాక్రాంతమైంది. భద్రాద్రి జిల్లాలో 9,906 ఎకరాలకు గాను 1,039 ఎకరాల భూమి ఆక్రమణకు గురైంది. వాటిని స్వాధీనం చేసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నా.. ప్రత్యేకంగా ఈఓలు లేక సాధ్యపడడం లేదు.

పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు..



ఉమ్మడి జిల్లాకు 18 ఈఓ పోస్టులు ఉండగా, ఏడు భర్తీ చేయాల్సి ఉంది. ఇందుకోసం దేవాదాయ శాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపించాం. అధికారులను నియమించగానే అవసరమైన ఆలయాలకు కేటాయిస్తాం. అప్పటివరకు భక్తులకు ఇబ్బంది లేకుండా పర్యవేక్షిస్తాం.

– వీరస్వామి, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్

బీజేపీ అధ్యక్షుడిపై వ్యాఖ్యలకు నిరసన


నిరసనలో బీజేపీ, ఎస్సీ మోర్చా నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అనుచిత వ్యాఖ్యలు చేయడం గర్హనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం ఖమ్మంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా కోటేశ్వరరావు, శ్రీధర్ మాట్లాడుతూ దళితుల గౌరవాన్ని బీజేపీ ఎల్లవేళలా కాపాడుతుందనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. నాయకులు కోటమర్తి సుదర్శన్, గెంటల విద్యాసాగర్, నున్న రవికుమార్, ప్రతాప్, చిన్నికృష్ణ, శ్రీకృష్ణ, శ్రీని వాస్, రాజేష్, విజయరెడ్డి, సరస్వతి, మణి, రుద్ర ప్రదీప్, చంద్రశేఖర్, సతీష్, సాయిరాం, వీరభద్రం, నరేష్, నారాయణ, మల్లేశ్వరి, వంశీ, అనిత, జ్వాల పాల్గొన్నారు.

నిరసనలో ఘర్షణ

బీజేపీ నాయకులు నిరసన తెలిపే క్రమాన డిప్యూటీ సీఎం భట్టిపై విమర్శలు చేయగా, అక్కడకు చేరిన కొందరు కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం తెలిపినట్లు తెలిసింది. ఈక్రమంలోనే ఇరువర్గాల మధ్య తోపులాట జరిగినట్లు సమాచారం. అక్కడ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు శ్రీధర్‌పై దాడి చేశారని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఆ సమయాన పోలీసులు ఇరువర్గాలను పంపించారు. ఘటనలో శ్రీధర్‌కు గాయాలు కాగా ఆస్పత్రికి తరలించడంతో పలువురు పరామర్శించారు. అయితే, పోలీసుల పట్టింపులేని తనంతోనే ఈ ఘటన జరిగిందని బీజేపీ నాయకులు ఆరోపించారు.

ధాన్యం కొనుగోలు ఎరికరాలు, రికార్డుల తనిఖీ

ఖమ్మంవ్యవసాయం: ధాన్యం కొనుగోళ్ల సమయాన వినియోగించిన పరికరాలతో పాటు మార్కెట్ రికార్డులను స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ బీఎస్.రావు సోమవారం తనిఖీ చేశారు. వైరా, కల్లూరు, సత్తుపల్లి మార్కెట్ల పరిధిలో ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లకు ఉపయోగించిన పరికరాలను పరిశీలించడమే కాక బిల్లులపై ఆరా తీశారు. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ.అలీం, మార్కెట్ కార్యదర్శులు టి.కిరణ్‌కుమార్, మొహిసిన్ సుల్తాన్. జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు అప్పయ్య, సంక్రాంతి లఘుచిత్రాలకు అవార్డులు


కొత్తపల్లి శేషు


మొగిలి గుణకర్

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంకు చెందిన కొత్తపల్లి శేషు రచన, దర్శకత్వంలో రూపొందిన కల్లూరు అప్పయ్య, సంక్రాంతి–2025 లఘుచిత్రాలకు మలేషియా సినీ అవార్డ్స్ సంస్థ అవార్డులు ప్రకటించింది. ఈ సినిమాలకు గాను ఉత్తమ రచయిత, దర్శకుడు, స్క్రీన్ ప్లే అవార్డులు కొత్తపెల్లి శేషుకు, ఉత్తమ నిర్మాతగా గుజ్జూరి శ్రీధర్‌బాబుకు, ఉత్తమ నటులుగా మొగిలి గుణకర్, నల్లగట్ల కిషోర్ బాబుతో పాటు ఉత్తమ నటిగా మహేశ్వరి, యామినికి అవార్డులు లభించాయి. జిల్లాకు చెందిన దర్శకుడు, నటులు అవార్డులు సాధించడంపై మిత్రా గ్రూప్ చైర్మన్ కురువెళ్ల ప్రవీణ్‌కుమార్, డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, కాపా మురళీకృష్ణ, నటుడు కాంతేశ్వరరావుతో పాటు పలువురు కళాకారులు అభినందించారు.

సమస్యల పరిష్కారమే అజెండాగా కార్యాచరణ


మాట్లాడుతున్న బాగం హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు సూచించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం తోట రామాంజనేయులు అధ్యక్షతన ఖమ్మంలో సోమవారం జరగగా ఆయన మాట్లాడారు. పాలకులు ప్రజలను విస్మరించినందున ప్రజాసమస్యలు గుర్తించి పరిష్కారానికి ఉద్యమాలు చేపట్టాలని తెలిపారు. కాగా, కేంద్రప్రభుత్వం కార్పొరేట్ల మేలు కోసమే పనిచేస్తోందని ఆరోపించారు. ఇక రాష్ట్రంలో రుణమాఫీ సంపూర్ణంగా అమలుచేయలేదని విమర్శించారు. ఈనెల 19, 20వ తేదీల్లో మధిరలో జరిగే పార్టీ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సూచించారు. నాయకులు దండి సురేష్, మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, క్లైమెంట్, యర్రా బాబు, ఎస్.కే.జానీమియా, లతాదేవి పాల్గొన్నారు.

ఆగి ఉన్న బస్సును ఢీకొట్టిన ట్యాంకర్

- డ్రైవర్‌తో పాటు ఆరుగురికి గాయాలు
- వెనక సీటులో ఇరుక్కుపోయిన చిన్నారి, మహిళ


బస్సు వెనుక భాగం నుంచి ప్రయాణికులను బయటకు తీసేందుకు యత్నిస్తున్న స్థానికులు


వెనుక సీటులో ఇరుక్కుపోయిన ఇషిత, మహిళ

కారేపల్లి: ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనక నుంచి వేగంగా వచ్చిన ట్యాంకర్ ఢీకొట్టిన ఘటన సోమవారం కారేపల్లి మండలం కామేపల్లి క్రాస్ వద్ద సోమవారం జరిగింది. ఖమ్మం నుంచి ఇల్లెందు వైపు వెళ్తున్న బస్సు కామేపల్లి క్రాస్ స్టేజీ వద్ద ఆగింది. ఈక్రమంలో ప్రయాణికులు దిగుతుండగా వెనుక నుంచి వచ్చిన యాష్ ట్యాంకర్ బలంగా ఢీకొట్టింది. ఈ సమయాన బస్సులో డ్రైవర్, కండక్టర్‌తో పాటు 47 మంది ప్రయాణికులు ఉండగా, డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో బస్సు కాస్త ముందుకు వెళ్లి ఆగింది. ఈ ఘటనలో డ్రైవర్ అంజికి తీవ్ర గాయం కాగా, వెనక సీటులో ఉన్న చిన్నారి ఇషిత, మరో మహిళ అందులో ఇరుక్కుపోయారు. దీంతో కారేపల్లి, కామేపల్లి పోలీసులతో పాటు స్థానికలు బస్సు వెనకాల నుంచి లోనకి వెళ్లి వారిని అతి కష్టంపై బయటకు తీసుకొచ్చారు. కాగా, ఘటనలో డ్రైవర్ సహా రమాదేవి, శ్రీవిద్య, సౌరి, బానోతు బాలా, ఇషిత, నాగభూషణం గాయపడడంతో 108 అంబులెన్స్‌లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో ఖమ్మం – ఇల్లెందు రహదారిపై వాహనాలు నిలిచిపోగా జేసీబీ తో బస్సు, లారీని పక్కకు తీయించారు. కాగా, ప్రమాదం జరిగిన ప్రాంతం ఎడమ వైపు కామేపల్లి, కుడి వైపు కారేపల్లి మండల పరిధిలోకి రావడంతో కేసు ఎవరు నమోదు చేయాలనే అనే అంశంపై పోలీసులు తర్జనభర్జన పడినట్లు తెలిసింది. చివరకు కారేపల్లి పరిధిగా తేల్చి ట్యాంకర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేశారు.డినట్లు తెలిసింది.

మహిళ హత్య కేసులో నిందితుడి రిమాండ్


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రెహమాన్

కొణిజర్ల: మహిళను హతమార్చిన ఘటనలో ప్రధాన నిందితుడిని అరెస్టు చేసినట్లు వైరా ఏసీపీ ఎం.ఏ.రెహమాన్ తెలిపారు. వైరా సీఐ సాగర్, కొణిజర్ల ఎస్ఐ జి.సూరజ్‌తో కలిసి సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. కామేపల్లి మండలం టేకులపల్లి తండాకు చెందిన భూక్యా మదన్ అదే గ్రామవాసి, అప్పటికే వివాహమైన భూక్యా హస్లీతో వివాహేతర సంబంధం పెట్టుకుని ఆమెతో కొణిజర్ల మండలం విక్రమ్‌నగర్‌లో ఆరేళ్లుగా సహజీవనం చేస్తున్నాడు. అయితే, హస్లీకి మళ్లీ పిల్లలు పుట్టే అవకాశం లేదని తెలిసి విక్రమ్‌నగర్ సమీపంలోని అఫ్జల్‌తండాకు చెందిన ఇంకో యువతిని వివాహం చేసుకున్నాడు. దీంతో గొడవలు జరుగుతుండగా హస్లీని అడ్డు తొలగించేలా ఇద్దరికి రూ.లక్ష సుపారీ ఇవ్వడమే కాక ఈనెల 8న హస్లీని బలవంతంగా సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం సమీప కిష్టారం అడవుల్లోకి తీసుకెళ్లి హత్య చేశారు. అయితే, హస్లీ కనిపించడం లేదని ఆమె కూతురు భూక్యా దేవి ఈనెల 11న ఫిర్యాదు చేయడమే కాక మదన్‌పై అనుమానం ఉందని వెల్లడించింది. దీంతో మదన్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా హత్య చేయించినట్లు ఒప్పుకోవడమేకాక ఘటనాస్థలాన్ని చూపించాడు. ఈ మేరకు మదన్‌ను రిమాండ్ తరలించి మరో ఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. కేసును త్వరగా పరిష్కరించిన వైరా సీఐ సాగర్, ఎస్ఐ సూరజ్, సిబ్బందిని ఆయన అభినందించారు.

30 కేజీల గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎక్సైజ్ పోలీసులు

ఖమ్మంక్రైం: ఖమ్మం కొత్త బస్టాండ్ సమీపాన సోమవారం ఉదయం చేపట్టిన తనిఖీల్లో 30 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ సీహెచ్.శ్రీహరిరావు తెలిపారు. ఎన్‌ఫోర్స్ సిబ్బంది తనిఖీలు చేపడుతుండగా బస్టాండ్ సమీపంలో రెండుప్లాస్టిక్ సంచులను గుర్తించారు. అందులో పరిశీలించగా 30కేజీల గంజాయి లభించగా, బాధ్యుల కోసం పరిసరాల్లో గాలించినా ఫలితం కానరాలేదని తెలిపారు. ఈ మేరకు గంజాయిని ఖమ్మం–1 ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించామని వెల్లడించారు. తనిఖీల్లో ఉద్యోగులు కరీం, బాలు, సుధీర్, వెంకట్, విజయ్,హన్మంతరావు, వీరబాబు, స్వరూప, ఉపేందర్ పాల్గొన్నారు.

6.64 క్వింటాళ్ల గంజాయి దహనం

తల్లాడ: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో కొద్దిరోజులుగా ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న 6.64 క్వింటాళ్ల గంజాయిని సోమవారంతల్లాడ మండలం గోపాలపేటలో ఏడబ్ల్యూఎం బర్నింగ్ ప్లాంట్‌లో దహనం చేయించారు. ఖమ్మం జిల్లాలో పట్టుబడిన 1.82 క్వింటాళ్లు, భద్రాద్రిజిల్లాలో 4.82 క్వింటాళ్ల గంజాయి ఇందులో ఉందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

పాముకాటుతో మహిళ మృతి


విజయలక్ష్మి (ఫైల్)

పెనుబల్లి: ఇంట్లో పనిచేసుకుంటున్న మహిళకు పాము కాటు వేయడంతో మృతి చెందింది. మండలంలోని ముత్తగూడెంకు చెందిన గరిడి నాగేశ్వరరావు భార్య విజయలక్ష్మి (35) సోమవారం ఉదయం ఇల్లు శుభ్రం చేస్తుండగా కాలి బొటన వేలిపై పాము కాటు వేసింది. దీంతో ఆమెను తిరువూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లేలోగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమెకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

- అధికారుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ధర్నా
- పల్లెగూడెం సబ్‌స్టేషన్‌పై దాడి


సబ్‌స్టేషన్ ఆవరణలో బైఠాయించిన గ్రామస్తులు, బంధువులు

ఖమ్మంరూరల్: డాబాపై దుస్తులు ఆరవేస్తున్న మహిళకు 11కేవీ విద్యుత్ తీగలు తాకడంతో షాక్‌కు గురై మృతి చెందిన ఘటన రూరల్ మండలంలోని కస్నాతండాలో సోమవారం జరిగింది. తండాకు చెందిన మాధవి(40)కి భ భర్త సైదయ్య, ఇద్దరు కుమారులు ఉండగా వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి ఇంటిపై నుంచి 11 కేవీ విద్యుత్ లైన్ వెళ్తోంది. ఈక్రమాన సోమవారం ఉదయం మాధవి దుస్తులు ఆరవేసేందుకు డాబాపైకి వెళ్లగా తీగలు చేతికి తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది.

మృతదేహంతో ఆందోళన

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే మాధవి మృతి చెందిందని ఆరోపిస్తూ ఆమె బంధువులు, స్థానికులు పల్లెగూడెం సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. ఇళ్ల పైనుంచి వెళ్తున్న లైన్‌ను తొలగించాలని పలుమార్లు కోరినా పట్టించుకోని పేర్కొన్నారు. ఈవిషయాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి విన్నవిస్తే లైన్ మార్పునకు నిధులు మంజూరు చేసినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ఈమేరకు మూడు గంటల పాటు ధర్నా జరగగా బంధువులు ఆగ్రహంతో సబ్‌స్టేషన్‌పై దాడి చేయగా కిటికీల అద్దాలు ధ్వంసమయ్యాయి. కాగా, ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు చేరుకుని నచ్చచెప్పగా ఆందోళన విరమించారు. కాగా, ఘటనపై మాధవి భర్త సైదయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ ముష్క రాజు తెలిపారు.

హెచ్చరికలు పాటించకే ప్రమాదాలు


మార్తి మాధవి (ఫైల్)

హెచ్చరికలు పాటించకపోవడంతోనే విద్యుత్ ప్రమాదాలు చోటు జరుగుతున్నాయని, ఈక్రమంలోనే కస్నాతండాలో ప్రమాదం జరిగిందని విద్యుత్ శాఖ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి ఒక ప్రకటనలో తెలిపారు. కస్నాతండాలో 11 కేవీ విద్యుత్ లైన్ కింద నిర్మించుకున్న మాధవి ఇంటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో అనుమతి లేకుండా విని యోగిస్తున్నారని వెల్లడించారు. ఈమేరకు ఏప్రిల్ 19న విద్యుత్ చౌర్యం కేసు కూడా నమోదైందని చెప్పారు. కాగా, ప్రమాదకరంగా ఉన్నచోట విద్యు త్ లైన్లను మార్చేందుకు చర్యలు చేపడుతామని ఎస్ఈ పేర్కొన్నారు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

ఖమ్మం లీగల్: కేసు విషయమై రాజీ చేస్తామంటూ నమ్మించి ఓ యువకుడి హత్యకు కారణమైన వ్యక్తికి జీవిత ఖైదుతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ ఖమ్మం ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి డి.రాంప్రసాద్‌రావు సోమవారం తీర్పు చెప్పారు. ఖమ్మంకు చెందిన శివను ఒక కేసు విషయంలో రాజీ చేస్తామని బీ.కే.బజార్ చెందిన ఉల్లోజు నాగరాజు నమ్మించాడు. ఈమేరకు 2024 జనవరి 22న శివను పిలిపించి నాగరాజుతో పాటు ఫిరంగి సాయి, ఫిరంగి కుమార్ కర్రలతో దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన శివ మృతి చెందగా ఆయన తండ్రి నారాయణ ఫిర్యాదుతో ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, కేసును విచారణ అనంతరం ఏ1గా నాగరాజుపై నేరం రుజువు కావడంతో జీవితఖైదుతో పాటు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. మిగతా ఇద్దరిపై నేరంరుజువు కాకపోవడంతో నిర్దోషులుగా ప్రకటించారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.కృష్ణమోహన్‌రావు వాదించగా, సిబ్బంది రామకృష్ణ, శ్రీకాంత్, చిట్టిబాబు సహకరించారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

మధిర: కుటుంబ కలహాల నేపథ్యాన ఓ ఒక వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఏపీలోని విజయవాడకు చెందిన కత్తి బాబ్జీ(57) హైదరాబాద్ యూసఫ్‌గూడలోని ఒక అపార్ట్‌మెంట్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉండగా వారిద్దరు ఏడాదిగా వేరే నివసిస్తున్నారు. ఈ క్రమాన మనస్తాపానికి గురైన బాబ్జీ ఆదివారం సాయంత్రం మధిర చేరుకుని ఒక హోటల్‌లో గది అద్దెకు తీసుకున్నాడు. అయితే, సోమవారం ఉదయం తలుపు తీయకపోవడంతో సిబ్బంది బలవంతంగా తెరిచి చూడగా బాబ్జీ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉన్నాడు. దీంతో మధిర టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు.